


# 'కిన్నెర' పంకజం కథ

"...ఇదీ నా కథ" అంటూ ముగించింది 'పంకజం'.

"థాంక్స్" అనుకున్న దానికంటే ఇంకో ఐదు రూపాయలు ఎక్కువే కుక్కాడు చేతిలో ప్రముఖ రచయిత 'రావ్'

"దీన్నే పత్రిక్కి పంపుతారు ?"

"ఎందుకు"

"నా కథను నేను చదువుకుంటే ఎలా వుంటుందోనని"

"సుధ -కి" చెప్పాడతను.

"ఓహో పోటీకన్న మాట! బహుమతి వస్తే ఎక్కువేవస్తుంది. ఒకవేళ బహుమతి వస్తే నాకు సగం ఇస్తారా ?"

"అదెలా ?!" విచిత్రంగా చూశాడామె వంక.

"అది నా కథ ! చెప్పింది నేను - మరి నాకు వాటా యివ్వక పోవడమన్యాయం!"

అదోలా నవ్వి బయటకు వచ్చేశాడు — 'అది కుదరనిపని' అన్నట్లు.

ఉగాది సందర్భంగా 'సుధ - 'జ్వాల' అనే ఓ రెండు ప్రముఖ పత్రికలు కథల పోటీలను నిర్వహిస్తున్నాయ్. పెద్ద మొత్తాలనే బహుమతులుగా ప్రకటించాయి కూడా.

ఏదో ఒక పత్రికలోనైనా బహుమతి సంపాదించాలనే కృత నిశ్చయంతో ఉన్న రావ్ కొత్త థీమ్స్ కోసం అన్వేషణ ప్రారంభించాడు.

ఆ సందర్భంలోనే శరీరం అమ్ముకుని బతికే - ప్రియుడిచే మోసగింపబడి, బలవంతాన 'వృత్తిలోకి తోయబడ్డ-పంకజాన్ని కలిశాడు -కదిలాచ్చాడు. మంచి ఇతివృత్తాన్నే సంపాదించాడు.

ఆ రాత్రికి రాత్రే దాన్నో మంచి కథగా మలచే వరకూ నిద్రపోలేదు.

మరుసటి రోజే ఆ కథను 'సుధ'కి వేరొక కథను 'జ్వాల'కి పంపి గుండెల

ందుగా ఊపిరి పీల్చుకున్నాడు.

• • •

ఉగాది ఇరవై రోజులుందగానే పోస్టుమాన్ కోసం ఎదురు చూడటం ప్రారంభించాడు - 'మీకథకు బహుమతిచ్చాం' అని టెలిగ్రామో, ఉత్తరమో వస్తుందేమోనని.

అలా కళ్ళు కాయలు కాచేలా, ఉగాది సంచికలు చేతికొచ్చే వరకు ఎదురుచూడటం మానలేదు.

'సుధ' ఉగాది సంచికలో 'సాధారణ ప్రచురణ'కి స్వీకరించిన కథల్లో తనకథ 'ఓ వేశ్యకథ' కూడా ఉండటం కాస్త సంతృప్తిని కలుగజేసింది.

కాని -

'జ్వాల'లో కనీసం సాధారణ ప్రచురణకి కూడా స్వీకరించలేదు.

నిరుత్సాహంగానే మొదటి బహుమతి పొందిన కథ చదివిన తర్వాత రావ్ షాక్ తిన్నట్లయ్యాడు! బుర్ర గిర్రున తిరిగినట్లయింది. గుండె చెరువై పోయింది.

'అరే ఎలా జరిగింది?! అచ్చం నా కథలానే ఉంది ఏవో అక్కడక్కడా చిన్న మార్పులు, పేరూ తప్ప!... రాసింది రచయితో రచయిత్రో అర్థం కావడం లేదు - ఈ సారి ఎందుకనో పరిచయాలు ఇవ్వలేదు... కాని ఎలా జరిగింది? ... తను నిజంగానే పొరపాటు చేశాడు. ఆ కథని 'సుధ'కి పంపకుండా దీనికి పంపాల్సింది...'

ఆ రాత్రంతా అతనికివే ఆలోచన్లు!

'పంకజం' తనకు చెప్పినట్లే ఇంకెవరికైనా తన కథను చెప్పిందేమో?.. బహుశా అంతే జరిగుండాలి...

ముగింపుకు రాని ఆలోచనల్లో ఆ రాత్రి ముగిసిపోయింది.

* * *

ఆ వేళ -

పోస్టుమాన్ ఇచ్చిన రెండుత్తరాలలో మొదటిది చదివిన రావ్ అవమానంతో కుతకుతలాడిపోయాడు.

'రచయిత రావ్ గారికి,

ఈవారం ప్రకటించిన 'సాధారణ ప్రచురణ'కి స్వీకరించిన 'కథల లిస్టు'లోని మీ రచన 'ఓ వేశ్యకథ' ప్రచురణ నిలిపివేయడం జరిగిందని తెలియజేయటానికి చింతిస్తున్నాం. దీనికి కారణం 'జ్వాల' పత్రికలో ప్రథమ బహుమతి పొందిన కథ - మీకథా ఒకేలా ఉండటమేనని వేరే చెప్పక్కర్లేదనుకుంటాం. ఇలా ఇంకోసారి జరగదని అనిస్తున్నాం -

సంపాదకుడు

-'సుధ'-

రెండో ఉత్తరం కూడా చదివిన రావ్ నిర్ఘాంతపోయి అలానే కుర్చీలో కూలబడిపోయాడు.

ఆ ఉత్తరంలో ఉన్నదిది —

'రచయిత రావ్‌గారికి,'

'జ్వాల' పత్రికలో ప్రయిజొచ్చిన కథ ఎవర్రాసుంటారా అని తల బద్దలు కొట్టుకునే మీకు ఈ ఉత్తరం రిలీఫ్ నిస్తుందనుకుంటాను.

ఆ కథను రాసింది నేనే! ఇదే నా మొదటి రచన కూడా నిజానికది నా జీవితమే! మిమ్మల్ని కలవక ముందే దాన్ని నేను రాశాను అది బాగా వచ్చిందో లేదోనని మథన పడుతున్న తరుణంలో 'నీ కథ చెబుతావా?'-అంటూ మీరొచ్చారు నా కథ విన్న మీరు సంతృప్తి పడినట్లు గ్రహించాను ఒక కథ మంచిదని తెలియడానికి అంతకు మించి ఇంకేం కావాలి? అందుకే మీరు చెప్పిన పత్రికకి కాక ఇంకో (జ్వాల) పత్రికకి పంపాను అదృష్టం కొద్దీ ప్రయిజొచ్చింది.'

ఇప్పుడు నేను నావృత్తి మానేశాను.

ఇక్కడే ఓ మాట!

మీలాంటి రచయితలు నాలాంటి వాళ్ళ గురించి రాసి డబ్బు సంపాదించడంతో పాటు మా గురించి ఏ కొంచెమైనా ఆలోచించటం జరిగినప్పుడే సమాజం మారేది.

అంతవరకూ ఇంతే!

—'పంకజం'